# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 15 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 20 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :15 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 20 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పేదల ఆనందం చూసి నా జీవితం ధన్యమైంది

**ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను: విశాఖలో చంద్రబాబు ఎమోషనల్**

- విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని సీఎం చంద్రబాబు భరోసా
- విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన
- గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ
- గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు






పెన్ పవర్ డెస్క్:విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు

- మిగతా 2లో



## సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన.. సోమవారం నుంచే!

- పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్
- రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌కు శ్రీకారం
- మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు, మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ
- తాగునీటి పథకాలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన

పెన్ పవర్ డెస్క్:ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా

- మిగతా 2లో



## ఏపీ అమ్మాయిలు టీమిండియాలో ఆడాలి


- మంగళగిరిలో మహిళల ఏపీఎల్ ప్రారంభంపై మంత్రి లోకేశ్ హర్షం
- ఏపీ అమ్మాయిలు జాతీయ జట్టుకు ఆడాలన్నదే లక్ష్యమని వెల్లడి
- ట్రోఫీని ఆవిష్కరించిన నారా బ్రాహ్మణి, బ్రాండ్ అంబాసిడర్ మిథాలీ రాజ్
- వేదిక కల్పించిన ఏసీఏకు లోకేశ్ అభినందనలు
- ఏపీ నుంచి భవిష్యత్ ఛాంపియన్లు వస్తారని ఆశాభావం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మహిళా క్రికెటర్లు జాతీయ జట్టులో స్థానం సంపాదించాలన్నదే తన ఆకాంక్ష అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళా క్రికెటర్ల కలల ను సాకారం చేసేందుకు తొలిసారిగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) ఒక బలమైన వేదిక అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం మంగళగిరిలో డబ్ల్యూఏపీఎల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టోర్నమెంట్ ట్రోఫీని నారా బ్రహ్మణి, భారత మహిళా క్రికెట్ దిగ్గజం, టోర్నీ బ్రాండ్ అంబాసిడర్ మిథాలీరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ టోర్నీ ప్రారంభంపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తన

- మిగతా 2లో

## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం
- సోమవారం నుంచి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరిక
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన




పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ

- మిగతా 2లో

## కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత

- హుబ్బళ్లి పర్యటనలో అస్వస్థతకు గురైన అమిత్ షా
- మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గైర్హాజరు
- వైద్యుల సూచన మేరకు హోటల్‌లోనే విశ్రాంతి
- ఆయన స్థానంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



పెన్ పవర్ డెస్క్:కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుబ్బళ్లిలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమానికి ఆయన హాజరు కాలేకపోయారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆయన హోటల్‌కే పరిమితమయ్యారు. హుబ్బళ్లిలోని కేఎల్ఈ జగద్గురు గంగాధర్

- మిగతా 2లో



## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ
- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ
- చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన

- మిగతా 2లో



## తిరుమలలో వైభవంగా సాగిన గరుడ సేవ..

### రెండు లక్షల మంది భక్తులతో పోటెత్తిన మాఢవీధులు

- శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైనది గరుడ సేవ
- గరుడ వాహనంపై భక్తులను కటాక్షించిన మలయప్ప స్వామి
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు
- గోవింద నామస్మరణలతో మార్మోగిన తిరుమల కొండ
- భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు, నిరంతర పర్యవేక్షణ

పెన్ పవర్ డెస్క్:తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ

- మిగతా 2లో



## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం

- తప్పుడు హామీలతో ప్రజలను నమ్మించి కూటమి అధికారంలోకి వచ్చిందంటూ పేర్ని నాని ధ్వజం
- సూపర్ సిక్స్ హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని విమర్శ
- ప్రజల నుంచి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరిక

- మిగతా 2లో

## ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

- లోకేశ్ నివాసంలో ఇంటర్ బోర్డు పాలకవర్గం సమావేశం
- 1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలని నిర్ణయం
- ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని తీర్మానం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ

- మిగతా 2లో





## మానవత్వం చాటుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

పెన్ పవర్ డెస్క్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధి తులకు సాయమందించి కేంద్ర మంత్రి బండి సంజయ్ మానవత్వం చాటుకున్నారు. రాజీవ్ రహదారిలో ఓ కారు సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. భర్త డ్రైవింగ్ చేస్తుండగా.. భార్య ముందు సీట్లో, కుమార్తె వెనుక సీట్లో కూర్చున్నారు. ప్రమాద సమయంలో ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో దంపతులకు ప్రాణాపాయం తప్పింది. వెనుక సీట్లో ఉన్న కుమార్తె తల, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయి.

- మిగతా 2లో




### జగన్ నిర్ణయం మార్చుకున్నారా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ రాజీపడుతున్నారా? తన నైజాన్ని పక్కన పెట్టి వచ్చే ఎన్నికల్లో విజయం కోసం నిర్ణయాలను మార్చుకోవాలని భావిస్తున్నారా? అంటే నిజమేనని అంటున్నారు. వైసీపీ నుంచి వీడిన నేతలను తిరిగి చేర్చుకునేందుకు జగన్ సిద్ధమవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. వైసీపీ నుంచి వీడిన కొందరు కీలక నేతలను తిరిగి పార్టీలోకి చేర్చుకునేందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత పలువురు సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుత మారుతున్న సమీకరణాల నేపథ్యంలో, వీరిలో కొందరు నాయకులు తిరిగి పార్టీలోకి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

**రీ-ఎంట్రీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారా?**

పార్టీ వీడిన కొందరు కీలక స్థానిక నాయకులను, మాజీ మంత్రులను తిరిగి చేర్చుకోవడం ద్వారా క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపవచ్చని వైఎస్ జగన్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషణలు చెబుతున్నాయి. గతంలో వ్యతిరేకించినప్పటికీ, మారుతున్న పరిస్థితుల్లో కొందరు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు మళ్లీ జగన్ వైపు మొగ్గు చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయడంపై అధినేత ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో భీమవరం నుంచి గెలిచిన గ్రంధి శ్రీనివాస్ లాంటి నేతల రీ-ఎంట్రీ గురించిన చర్చలు పార్టీ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇతర పార్టీలోకి వెళ్లిన నేతలు అక్కడ సంతృప్తికరంగా లేకపోవడం, తగిన ప్రాధాన్యత లేకపోవడంతో తిరిగి ఫ్యాన్ గూటికి చేరడంపై కొందరు ముఖ్య వైసీపీ నేతలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం అందుతుంది. అయితే ఇందులో ఎవరు వస్తారు? ఎవరిని తిరిగి పార్టీలోకి తీసుకోవాలి? అన్న విషయంపై జగన్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం.

**పార్టీని బలోపేతం చేసే వ్యూహమే...**

ఇతర పార్టీల నుంచి లేదా సొంత గూటికి తిరిగి వచ్చే నేతల వల్ల పార్టీకి మైలేజీ పెరిగి, స్థానికంగా బలం చేకూరుతుందనుకుంటే ఖచ్చితంగా తలుపులు తెరిచే ఉంచాలనే సంకేతాలు పార్టీ అంతర్గత సమావేశాల్లో వ్యక్తమయ్యాయి. ఒకవైపు పార్టీ వీడుతున్న నేతలను ఆపుతూనే, మరోవైపు పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకునేందుకు, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకు జగన్ తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. అయితే, ఇప్పటివరకు ఈ నాయకుల రీ-ఎంట్రీలపై పార్టీ పరంగా ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, కొందరు మాజీ నేతలు మాత్రం వైఎస్ జగన్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది. అయితే పార్టీ క్లిష్ట సమయంలో వీడిన నేతలను తిరిగి చేర్చుకోవడంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అలా చేర్చుకున్నందువల్ల పార్టీ పట్ల నిబద్ధత, అంకిత భావం కొరవడుతుందని, కష్టమైనా, నష్టమైనా నమ్ముకున్న వాళ్లకే అవకాశమివ్వాలన్న వాదన కూడా వినపడుతుంది. మరి జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. జగన్ అనివార్య పరిస్థితుల్లో రాజీ పడుతున్నట్లు స్పష్టమవుతోంది. మరి ఈ వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయో, స్థానిక ఎన్నికల్లో వైసీపీ ఏ విధంగా నిలదొక్కుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- మొదటి పేజీ తరువాయి

సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్‌లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయువ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## తిరుమలలో వైభవంగా సాగిన గరుడ సేవ..

- మొదటి పేజీ తరువాయి

లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపు రూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన భక్తుల "గోవిందా.. గోవిందా.." నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి. శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్టి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు.

**భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**

గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు.

**టీటీడీ ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ**

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు తిరుమలలోని 8 కీలక ప్రాంతాల్లో సెక్టోరల్ అధికారులుగా విధులు నిర్వర్తించారు. వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక అయిన గరుత్మంతునిపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర దేవి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

# పేదల ఆనందం చూసి నా జీవితం ధన్యమైంది

- మొదటి పేజీ తరువాయి

కన్వీనియన్స్ డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను" అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు.

**దశాబ్దాల నిరీక్షణకు తెర.. సర్వ హక్కులు మీవే!**

"కూడు, గూడు, గుడ్డ అనేది మా విధానం. 40 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని సంకల్పిస్తే, అదే స్ఫూర్తితో మేము పనిచేస్తున్నాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లలో నివసిస్తున్నా, వాటిపై పూర్తి హక్కు లేదనే వేదనతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ పట్టాభిషేకం ద్వారా విముక్తి కల్పించామన్నారు. "నిన్నటి వరకు మీ ఇంటిపై మీకు హక్కు లేదు. కానీ ఈరోజు నుంచి మీ ఇంటి మీద సర్వ హక్కులు మీవే. ఇకపై అనుమానం లేదు, వివాదం లేదు, భయం లేదు. తిరుగులేని హక్కు మాత్రమే ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 మండలాల్లోని 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, రూ. 8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని తెలిపారు. "నిన్నటి వరకు అప్పు కావాలంటే గ్యారెంటీ లేని మీరు, ఈరోజు ఈ ప్రభుత్వం ఇచ్చిన పట్టాతో ఏ బ్యాంకులోనైనా స్వేచ్ఛగా రుణం పొందవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

**మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు**

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. "దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!**

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్లు ఒక పీడకల. రూ. 10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది" అని ఎద్దేవా చేశారు. "నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.

**విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!**

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. "రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది" అని ఆయన ప్రకటించారు.

విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, "ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ" అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.

**అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!**

పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీయే ప్రభుత్వం. రైల్వే జోన్‌ను రియాలిటీగా మార్చింది మేము. పేదరికం లేని సమాజం, ఆర్థిక అసమానతలు తగ్గడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలని కోరారు. "2047 నాటికి 'వికసిత భారత్'తో దేశం ప్రపంచంలో నంబర్ వన్ అవుతుంది. అదే సమయంలో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచంలోనే తెలుగు జాతిని అత్యంత శక్తివంతమైన జాతిగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ" అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

- మొదటి పేజీ తరువాయి

అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ రికార్డులను అత్యాధునిక 'బ్లాక్‌చైన్ టెక్నాలజీ'తో అనుసంధానించనున్నారు. విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు.

20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐ+గాట్ కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

## సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన.. సోమవారం నుంచే!

- మొదటి పేజీ తరువాయి

సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు. మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు.

ఈ అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలను అందజేయనున్నారు. ఉప్పాడ తీరప్రాంత

మత్స్యకారులకు ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించనున్నారు. అదేవిధంగా, 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందించి వారి భూములపై హక్కులు కల్పించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ పటిష్ఠమైన పునాదులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత

- మొదటి పేజీ తరువాయి

మహాస్వామిగళు మూరుసవిర్మఠ్ మెడికల్ కాలేజీ నూతన భవనాన్ని, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా ప్రారంభించాల్సి ఉంది. రూ. 700 కోట్ల వ్యయంతో ఈ మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమం నిమిత్తం షెడ్యూల్ ప్రకారమే శుక్రవారం రాత్రి ఆయన హుబ్బళ్లి చేరుకుని ఒక హోటల్‌లో బస చేశారు. అయితే, శనివారం ఉదయం ఆయన అనారోగ్యానికి గురికావడంతో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అమిత్ షా గైర్హాజరీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్యా శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనారోగ్య కారణాల వల్లే అమిత్ షా ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని కేఎల్ఈ సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్ కోరే స్పష్టం చేశారు.

## మానవత్వం చాటుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

- మొదటి పేజీ తరువాయి

అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళ్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రమాదాన్ని గమనించి.. వెంటనే తన వాహనాన్ని నిలిపి భద్రతా సిబ్బందితో కలిసి కారు వద్దకు వెళ్లారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీసేందుకు సహకరించారు. తీవ్రంగా గాయపడిన కుమార్తెతో పాటు ఆమె తల్లిదండ్రులను తన భద్రతా సిబ్బంది వాహనంలో వెంటనే ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర మంత్రి సూచించారు.

## ఏపీ అమ్మాయిలు టీమిండియాలో ఆడాలి

- మొదటి పేజీ తరువాయి

సంతోషాన్ని పంచుకున్నారు. "మంగళగిరిలో తొలి మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉంది. యువ మహిళా క్రికెటర్లు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి డబ్ల్యూఏపీఎల్ బలమైన పునాది వేస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న మిథాలీరాజ్‌కు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారిణులకు డబ్ల్యూపీఎల్, ఆ తర్వాత టీమిండియాకు ఆడే మార్గాన్ని సుగమం చేస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను లోకేశ్ అభినందించారు. టోర్నీలో పాల్గొంటున్న నాలుగు జట్లకు, ప్రతి క్రీడాకారిణికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ టోర్నమెంట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి భవిష్యత్ ఛాంపియన్లు ఆవిర్భవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.

## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం

అధికార పీఠం ఎక్కేందుకు ఊహాజనిత హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టేసిందని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు అందక, సరైన ప్రణాళికలు లేక కరవు కోరల్లో చిక్కుకుని రైతాంగం అల్లాడిపోతుంటే... కూటమి నాయకులు మాత్రం పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని దోచుకోవడంలో నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు. గతంలో జగన్ అందించిన పారదర్శక సంక్షేమ పథకాల కంటే మిన్నగా పథకాలు ఇస్తామంటూ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు ఇప్పుడు ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ అశాస్త్రీయ విధానాలు, మోసపూరిత వైఖరిపై నియోజకవర్గాల వారీగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో బాధితులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ఈ ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకే కూటమి నాయకత్వం ప్రతిరోజూ కొత్త నాటకాలకు తెరలేపుతోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పేర్ని నాని హెచ్చరించారు.

# కాకినాడ తీరంలో ఘనంగా అంతర్జాతీయ తీరప్రాంత పారిశుధ్య దినోత్సవం

**ప్లాస్టిక్ రహిత తీర ప్రాంతాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**కలెక్టర్ హరేంధిర ప్రసాద్**






**కాకినాడ రూరల్, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** సముద్ర జీవరాశుల సంరక్షణకు తీర ప్రాంతాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ తీరప్రాంత పారిశుధ్య దినోత్సవం--2026, స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం కాకినాడ రూరల్ సూర్యాపేట ఎన్‌టీఆర్ బీచ్‌లో ఐసీజీఎస్ కాకినాడ ఆధ్వర్యంలో తీరప్రాంత పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొని తీరప్రాంతాన్ని శుభ్రం చేశారు. అధికారులు,ప్రజాప్రతినిధులు,స్థానిక పాఠశాలలు,కళాశాలల విద్యార్థులతో పాటు కేఎస్పీఎల్,వేదాంత,రిలయన్స్, ఓఎన్‌జీసీ, షాపూర్జీ పల్లోంజీ, కోరమండల్ తదితర పారిశ్రామిక, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.సముద్ర తీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్,ఇతర వ్యర్థాలను తొలగిస్తూ సుమారు 500 కిలోల చెత్తాచెదారాన్ని సేకరించారు. అనంతరం తీర ప్రాంత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై కలెక్టర్ అధికారులతో స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తీరప్రాంత పరిశుభ్రతను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతరం కొనసాగించాల్సిన ప్రక్రియగా భావించాలని సూచించారు. సముద్ర జీవరాశులను రక్షించేందుకు తీర ప్రాంతాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. యువత, విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని కోరారు.కాకినాడ ఎన్‌టీఆర్ బీచ్‌ను పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సుస్థిర పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎకో-టూరిజం అభివృద్ధికి తీర ప్రాంతాల్లో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ తీరప్రాంత పారిశుధ్య కార్యక్రమాల ద్వారా సామూహిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర తీర ప్రాంత నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన, పర్యావరణహితమైన తీర ప్రాంతాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కోస్ట్ గార్డ్ విశ్రాంత సైనికులు, కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్న సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి లక్ష్మణరావు, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, పంచాయతీ అధికారి రవికుమార్, కాకినాడ రూరల్ ఎంపీడీవో సతీష్, కౌడా అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, చమురు నిర్వహణ భాగస్వాములు, కోస్ట్ గార్డ్ విశ్రాంత సైనికులు, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# మొక్కలు నాటి.. పరిసరాలను పరిశుభ్రం చేసిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 19:** కాకినాడ జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శనివారం స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటడంతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా.మహంతి కిషోర్ కుమార్,అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్. శ్రీనివాసరావు తదితర పోలీసు అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పెంపకం ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సూచించారు.పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని, పరిశుభ్రమైన వాతావరణం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని ఎస్పీ పేర్కొన్నారు. పరిశుభ్రత, పచ్చదనం కోసం ప్రజలు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్.రమేష్, ట్రాఫిక్-2 ఇన్‌స్పెక్టర్ డి.రామారావు,కాకినాడ రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. అప్పలనాయుడు,కాకినాడ రూరల్ ఇన్‌స్పెక్టర్ డి. చైతన్యకృష్ణ,పోర్ట్ ఇన్‌స్పెక్టర్ పి.సునీల్ కుమార్,మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి. దుర్గాప్రసాద్,డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.నరసింహమూర్తి,ఎస్సైలు, ఆర్ఎస్సైలు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# నేడు కాకినాడ జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటన

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 19:** రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం తిమ్మాపురం వద్ద ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో నిర్వహించనున్న 'భారతీయం' కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు.మంత్రి పర్యటన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం 5.30 గంటలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 5.50 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో ప్రయాణించి ఉదయం 6 గంటలకు బయలుదేరి 6.50 గంటలకు రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకుంటారు.అనంతరం రాజమండ్రి విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి ఉదయం 7 గంటలకు తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలకు చేరుకుంటారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అక్కడ జరిగే 'భారతీయం' ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొంటారు.కార్యక్రమం అనంతరం సాయంత్రం 6 గంటలకు తిమ్మాపురం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 7.30 గంటలకు రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకుంటారు. 7.40 గంటలకు విమానంలో రాజమండ్రి నుంచి బయలుదేరి రాత్రి 8.20 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 8.50 గంటలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకుంటారు.మంత్రి పర్యటన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ఇప్పటికే ఏర్పాట్లను చేపట్టారు.



# నాలుగు రోజులుగా వీఆర్‌ఏల నిరవధిక సమ్మె

**వీఆర్‌ఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి**

**అర్హులైన వారికి వీఆర్వో పోస్టులు కల్పించాలని డిమాండ్**

**కాజులూరు, పెన్‌పవర్, సెప్టెంబర్ 19:** ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఆర్‌ఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. కాజులూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం వీఆర్‌ఏలు విధులకు దూరంగా ఉండి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పే స్కేల్ అమలు చేయడంతో పాటు వేతనాలు పెంచి ఆర్థిక భద్రత కల్పించాలని, అర్హత కలిగిన వీఆర్‌ఏలకు వీఆర్వో పోస్టులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ పరిపాలనకు కీలకంగా సేవలందిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు విధులకు హాజరయ్యే పరిస్థితి లేదని స్పష్టం చేస్తూ నినాదాలు చేశారు.

**పే స్కేల్ అమలు చేయాలి**

ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు వినకోటి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామస్థాయిలో రెవెన్యూ పరిపాలనలో వీఆర్‌ఏలు కీలకమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ, ఏళ్లుగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేసి ఆర్థిక భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో వీఆర్‌ఏలకు అమలు చేస్తున్న విధంగా తమకు కూడా పే స్కేల్ సదుపాయాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

**అర్హులకు వీఆర్వో పోస్టులు కల్పించాలి**

నామినీలుగా పనిచేస్తున్న వారితో పాటు ఆన్‌లైన్ సెటిల్‌మెంట్ వీఆర్‌ఏలుగా విధులు నిర్వహిస్తున్న అర్హులను గుర్తించి, వారి సేవలను పరిగణనలోకి తీసుకుని తగిన విధంగా నియామకాలు చేపట్టాలని సత్యనారాయణ కోరారు. అర్హత కలిగిన వీఆర్‌ఏల్లో 70 శాతం మందిని వీఆర్వోలుగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు పదోన్నతి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**మృతుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలి**

విధి నిర్వహణలో మృతిచెందిన వీఆర్‌ఏల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సత్యనారాయణ కోరారు. ఆయా కుటుంబాల్లో అర్హత ఉన్న ఒకరికి వయసుతో సంబంధం లేకుండా ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్‌ఏల సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, పదోన్నతి అవకాశాలు కల్పించాలని కోరారు.

**వీఆర్వోల సంఘం సంఘీభావం**

వీఆర్‌ఏల సమ్మెకు కాజులూరు మండల వీఆర్వోల సంఘం మద్దతు తెలిపింది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన వీఆర్వోల సంఘం సభ్యులు వీఆర్‌ఏలకు సంఘీభావం ప్రకటించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని తెలిపారు. వీఆర్‌ఏల కోసం భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావుతో పాటు శివకుమార్, సుబ్రహ్మణ్యం, శ్రావణి, వరలక్ష్మి, సుబ్బారెడ్డి , రాయుడు,శ్రీరాములు,విష్ణు , సత్యనారాయణ,సూరిబాబు,శ్రీనివాస్, లోవమూర్తి ,తదితరులు మద్దతు తెలిపారు. వీఆర్‌ఏల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సంఘం నాయకులతో తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని వినకోటి సత్యనారాయణ కోరారు.సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని వీఆర్‌ఏలు స్పష్టం చేశారు.సమ్మెలో వీఆర్‌ఏలు వాసంశెట్టి సుబ్బారావు,తాతపూడి రాజు,ఎం. వెంకటరమణ,లంక రవికుమార్, ప్రసాద్,విష్ణు,భవాని,సాయిలక్ష్మి, వీర్రాజు,చంద్రశేఖర్,పద్మ, వెంకటేశ్వరరావు,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జేసీ

**'భారతీయం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశం**



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 19:** కాకినాడ రూరల్ నియోజకవర్గం తిమ్మాపురం వద్ద ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో ఆదివారం నిర్వహించనున్న 'భారతీయం' ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శనివారం పరిశీలించారు.ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమ వేదిక, ఇతర ఏర్పాట్లపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావుతో మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జేసీ చర్చించారు. విద్యాశాఖ సమన్వయంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.జేసీ వెంట ఆర్డీవో ఎస్. మల్లిబాబు, విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి,డీఈఓ రమేష్ బాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రజల కోసం ప్రయాణం, అభివృద్ధి కోసం కృషి



- పి.గన్నవరం అభివృద్ధికి రూ.1,232.67 కోట్ల విలువైన 22 ప్రతిపాదనలు
- త్వరలోనే కోనసీమకు కొబ్బరిబోర్డు
- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 19:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంబాజీపేట పర్యటన సందర్భంగా పి.గన్నవరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సంబంధించి 22 కీలక అభివృద్ధి ప్రతిపాదనలను అధికారికంగా సమర్పించినట్లు తెలిపానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.

పి.గన్నవరం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ. సమర్పించిన ఈ ప్రతిపాదనల మొత్తం అంచనా విలువ రూ. 1,232. 67 కోట్లు అని వెల్లడించారు. ప్రచారం కోసం కాకుండా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రతిపాదనలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రతిపాదనల్లో ఫైర్ స్టేషన్ పెండింగ్ నిధులు, అప్పనపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, అమలాపురంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయం, అప్పనపల్లి--ఐనవిల్లి--ఆదుర్రు ప్రాంతాలను సమగ్ర పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం, తొగరపాయ వద్ద సబ్మర్సిబుల్ బ్రిడ్జి, నాలుగు మండలాల్లో ఏటిగట్లపై బిటి రోడ్లు, 2027 గోదావరి పుష్కరాలకు సంబంధించి ఘాట్లు, ఆలయాలు, రహదారులు, వంతెనల అభివృద్ధి వంటి పలు అంశాలు ఉన్నాయని తెలిపారు. అలాగే పి.గన్నవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, డ్రైనేజీ, సాగునీరు, వరద రక్షణ, విద్యార్థులకు మౌలిక వసతులు, మార్కెట్ యార్డులకు లింక్ రోడ్లు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలకు విద్యుత్ చార్జీల రాయితీ వంటి అంశాలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, అనుమతులు సాధించడం, నిధులు తీసుకురావడం కోసం ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులతో సమన్వయం చేయడం తన బాధ్యత అని అన్నారు. తాను విమర్శలకు మాటలతో కాకుండా పత్రాలతో, అభివృద్ధి పనులతో సమాధానం చెబుతానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్పష్టం చేశారు. పి.గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా మరిన్ని అభివృద్ధి పనులు, నిధులు, మౌలిక వసతులు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పి.గన్నవరం అభివృద్ధి ఆగదని, ప్రజల కోసం తమ ప్రయాణం, అభివృద్ధి కోసం తమ కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి కో కన్వీనర్ మోకా ఆనందసాగర్, రాష్ట్ర నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధర్, బిజెపి అంబాజీపేట మండల అధ్యక్షుడు కురస ఆంజనేయులు, కూటమి నాయకులు గణపతి వీబుఅఘవులు, మైపాల తాతాజీ, వాసంశెట్టి కుమార్, మొల్లేటి శ్రీ నివాస్ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## వినాయక నిమజ్జనానికి భారీ పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు.

- నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన సీఐ, బి తిరుపతిరావు,ఎస్సై జి సతీష్ కుమార్
- ప్రమాదాలు నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్,19:** వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా జగ్గంపేట సీఐ, బి తిరుపతిరావు, కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ కుమార్ తో కలసి శనివారం కిర్లంపూడి మండలం పాలెం,భూపాలపట్నం గ్రామాల్లో నిమజ్జనం నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.నిమజ్జనానికి వచ్చే భక్తులు,యువతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.నీటి ప్రాంతాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని,నిమజ్జనం సందర్భంగా పోలీసులు చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ, బి తిరుపతిరావు కోరారు.గణేష్ విగ్రహాల నిమజ్జనాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని,ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సీఐ, బి తిరుపతిరావు కోరారు.నిమజ్జన ప్రదేశాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి సూచించారు.కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవాలకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరంరెడ్డి కాశీబాబు,నీలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.


## అంకంపాలెంలో ఘనంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 19:** మండలంలో అంకంపాలెం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా, స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి కొత్తపేట డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె. సురేష్ కుమార్ హాజరై పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టి చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి నిర్దేశిత ప్రదేశాల్లోనే పారవేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, వ్యర్థాల నిర్వహణపై కూడా అధికారులు సూచనలు చేశారు. అనంతరం డీడీవో పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ నిరంతరం కొనసాగేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించి, గ్రామంలో తిరుగుతున్న స్వచ్ఛ రథం పనితీరును పరిశీలించారు.కార్యక్రమంలో కోనసీమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు, ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, డిప్యూటీ ఎంపీడీవో కె. రమేష్ బాబు, అధికారులు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రక్తనిధి కేంద్రాల పనితీరును మెరుగుపరచాలి

- అత్యవసర సమయాల్లో సురక్షిత రక్తం సకాలంలో అందేలా చర్యలు
- రక్త సేకరణ లక్ష్యాలను నవంబర్ నాటికి సాధించాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్






**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 19:** జిల్లాలోని రక్తనిధి కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు అత్యవసర సమయాల్లో రోగులకు సురక్షితమైన రక్తం సకాలంలో అందేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రక్త సేకరణ, పరీక్షలు, నిల్వ, పంపిణీ, రక్త మార్పిడి ప్రక్రియల్లో నిర్దేశిత భద్రత, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.స్థానిక కలెక్టరేట్‌లో శనివారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లాలోని 12 రక్తనిధి కేంద్రాల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రక్తనిధి కేంద్రాల పనితీరు, రక్త సేకరణ లక్ష్యాల సాధన, రక్త మార్పిడి సేవలు, కేంద్రాల నిర్వహణ, మొబిలైజేషన్, ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా అమలు చేస్తున్న సురక్ష కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.

### నవంబర్ నాటికి లక్ష్యాలు సాధించాలి

జిల్లాలోని 12 రక్తనిధి కేంద్రాలు నవంబర్ నెలాఖరు నాటికి నిర్దేశించిన రక్త సేకరణ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. తుని ప్రాంతీయ ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రం మార్చి నాటికి పూర్తిస్థాయిలో పనిచేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కాకినాడ జీజీహెచ్ రక్తనిధి కేంద్రంలో ఉన్న పరికరాల కొరతను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అన్ని రక్తనిధి కేంద్రాలు నిర్దేశిత అనుమతులతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అన్నారు. రక్త నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించి వివిధ రక్త గ్రూపుల లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రక్త కొరత ఏర్పడే పరిస్థితులను ముందుగానే గుర్తించి, అత్యవసర సమయాల్లో అవసరమైన రక్త గ్రూపులు అందుబాటులో ఉండేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### రక్తదాన శిబిరాలు విస్తృతం చేయాలి

రక్త సేకరణను పెంచేందుకు స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. యువత, విద్యాసంస్థలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సామాజిక సంస్థల సహకారంతో మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను కూడా చేపట్టాలని అన్నారు.

### ఎయిడ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా అమలు చేస్తున్న సురక్ష కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు అపోహలను తొలగించాలని సూచించారు. అవసరమైన వారికి కౌన్సెలింగ్, పరీక్షలు, ఏఆర్‌టీ చికిత్సా సేవలు అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.రక్తనిధి కేంద్రాల కార్యకలాపాలకు సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ)లో ప్రతి విభాగం నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. గత జూలైలో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల అమలులో కాకినాడ జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు జిల్లా వైద్య ఆరోగ్య యంత్రాంగం చేపట్టిన చర్యలను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల ఎలాంటి వివక్ష లేకుండా సమాజంలో అవగాహన కల్పించాలని అన్నారు. సంబంధిత శాఖలు, రక్తనిధి కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాల ప్రయోజనాలను అర్హులకు అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. అనిత, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ మహేశ్వరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎస్. చలమయ్య, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మురళి, వైద్యులు స్రవంతి, రాజేశ్వరి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బాలాజీ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారులు, రక్తనిధి కేంద్రాల ప్రతినిధులు, సంబంధిత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తొలి తిరుపతిలో శృంగార వల్లభ స్వామి దర్శనాలకుభారీగా తరలివచ్చిన భక్తులు



**పెద్దాపురం రూరల్... పెన్ పవర్... సెప్టెంబర్..19..** శనివారం జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుండి శృంగారం వల్లభ స్వామి దర్శనాలకు వచ్చిన భక్తుల ద్వారా స్వామికి రికార్డు స్థాయిలో 1, 83 వేల 892 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డీ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మొయిల్లా సంధ్యా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు పెద్దింటి నారాయణచార్యులు శ్రీ భూ సమేత శృంగార వల్లభ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనాలకు ఉదయం వచ్చిన భక్తులకు పులిహోర మధ్యాహ్నం సుమారు 2500 మందికి అన్నప్రసాదాన్ని అందించినట్లు ఈ ఓ శ్రీనివాసరావు తెలిపారు గ్రామస్తులు, పాలక మండల సభ్యులు స్వామి సేవలో పాల్గొన్నారు.

## పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి ఎన్.సరస్వతి బోర్డ్ మెంబర్స్ తో పాటు పెద్దాపురం సబ్ జైలు ను సందర్శించడం







**పెద్దాపురం... పెన్ పవర్.. సెప్టెంబర్..19..** జడ్జి ముద్దాయిలతో మాట్లాడుతూ వారియొక్క యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అంతేకాకుండా వారి భోజనం మరియు మంచినీటి వసతులను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగాసబ్ జైలు నందు గల న్యాయసేవాధికార సంస్థ యొక్క న్యాయ సేవ కేంద్రం కూడా జడ్జి గారు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా జడ్జి ఎన్.సరస్వతి, ఆర్డీవో పి. కృష్ణమూర్తి డిఎస్పి ఎ.బి.జే తిలక్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ప్రభాకర్ శర్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి, అగ్రికల్చర్ ఆఫీసర్ దైవ కుమార్, పిడబ్ల్యుడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వాణి ప్యానల్ లాయర్ ఎస్ విశాలాక్షి పారా లీగల్ వాలంటీర్ లక్ష్మి, సూపరింటెండెంట్ కె. రమణ బాబు మరియు జైలు సిబ్బంది మొదలైన వారు పాల్గొన్నారు


## ‘కౌశలం’తో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

ఈనెల 21న పీఆర్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ ఇంటర్వ్యూలు



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 19:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ‘కౌశలం’ కార్యక్రమం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు కాకినాడ జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి జే. వేణుగోపాల్ తెలిపారు. ‘కౌశలం’ ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రముఖ ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న ప్రత్యేక ఉద్యోగ ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.కాకినాడలోని పీఆర్ డిగ్రీ కళాశాల మెయిన్ బ్లాక్‌లో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలిపారు.ఈ ఉద్యోగాలకు డిగ్రీ, బీసీఎస్, ఎంసీఎస్ విద్యార్హతలు కలిగి, 18 నుంచి 45 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులకు తొలుత రాత పరీక్ష నిర్వహిస్తామని,అందులో అర్హత సాధించిన వారికి తదుపరి నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తామని తెలిపారు.జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ ఎంపిక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జే. వేణుగోపాల్ పిలుపునిచ్చారు.

# నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలని తహసీల్దార్ కు వినతి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** నిత్యవసర వస్తువులు బియ్యం,పంచదార,పప్పు దినుసులు, ఉల్లిపాయలు ధరలు విపరీతంగా పెరిగిన కారణంగా సామాన్య ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు.దీనిపై మాజీ కేంద్ర మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు ఆదేశాల మేరకు శనివారం ప్రత్తిపాడు తహసీల్దార్, ఎం సూర్యప్రభకు పిసిసి సభ్యులు,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు. ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల శామ్యూల్.ఈరుగుల చక్రం పిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు

# తోట విష్ణు కుటుంబానికి జ్యోతుల నవీన్ పరామర్శ.



**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్,19:**కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన జగ్గంపేట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తోట విష్ణు మాతృమూర్తి నాగమణి ఇటీవలే స్వర్గస్తులైనారు.విషయం తెలుసుకున్న కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ శనివారం వీరవరంలోని తోట విష్ణు కుటుంబాన్ని పరామర్శించి స్వగృహంలో తోట నాగమణి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తోట విష్ణు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ఆయన వెంట కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు తోట రవి, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# ఆథ్లెటిక్స్‌లో ఆదిత్య విద్యార్థినికి కాంస్య పతకం

**సౌత్‌జోన్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పుష్యమి నాగసాయి ప్రతిభ**




**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 19:**గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థిని జి. పుష్యమి నాగసాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు పుదుచ్చేరిలో నిర్వహించిన 37వ సౌత్‌జోన్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-20 మహిళల 4ఐ100 మీటర్ల రిలే విభాగంలో ఆమె ఈ ఘనత సాధించింది.పుష్యమి నాగసాయి సాధించిన విజయంపై ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సెలర్ డా. ఎన్. సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సెలర్ డా. ఎం.బి. శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ప్రో వైస్ ఛాన్సెలర్లు డా. ఎ. రమేష్, డా. ఎస్. రమశ్రీ, డా. రవి తంగజం, డీన్ స్టూడెంట్స్ యాక్టివిటీస్ డా. డి. కిషోర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డా. ఎన్. రవి అభినందనలు తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటుతూ యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని యూనివర్సిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. పుష్యమి నాగసాయి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# విమలక్క 50 ఏళ్ల ప్రజాకళా ప్రస్థానానికి ఘనంగా ప్రజాకళా జాతర



- సెప్టెంబర్ 26 నుంచి హైదరాబాద్‌లో 50 గంటలపాటు కార్యక్రమాలు
- ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, మేధావులు పాల్గొనాలి: ఏపీఆర్సీఎస్

**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 19:**"52 ఏళ్ల అరుణోదయలో 50 ఏళ్ల విమలక్క ప్రస్థానం" పేరుతో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 50 గంటల ప్రజాకళా జాతరను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఏపీఆర్సీఎస్) జిల్లా నాయకులు కర్ణాకుల రామలింగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో ప్రజాకళా జాతర కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 50 గంటలపాటు పాట, ఆట, మాటలతో ప్రజాకళా జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 1960--70లలో చోటుచేసుకున్న నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ ప్రాంతాల విప్లవ ఉద్యమాలు అరుణోదయ ఏర్పాటుకు ప్రేరణగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. విప్లవ, ప్రజా సాంస్కృతిక ఉద్యమాల్లో కళాకారులు, కవులు కీలక పాత్ర పోషించారని, అటువంటి ఉద్యమాల్లో ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న అరుదైన వ్యక్తుల్లో విమలక్క ఒకరని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ బండ్రు నరసింహులు పోరాట వారసత్వం, తల్లి బండ్రు నరసమ్మ జీవన ప్రభావం విమలక్కపై ఉన్నాయని తెలిపారు. విప్లవ కార్యకర్త, కవి కామ్రేడ్ మిత్రతో ఆమె జీవన సహచర్యం కూడా ఆమె ప్రజాకళా ప్రస్థానానికి తోడ్పడిందన్నారు. ప్రజా ఉద్యమాల్లో అమరులైన వారి త్యాగాలు ఆమెను నిరంతరం ముందుకు నడిపించాయని పేర్కొన్నారు. బాల్యం నుంచే ఇంటి ముందు జరిగే బతుకమ్మ ఆటలు, పాటలు విమలక్కను ప్రభావితం చేశాయని రామలింగేశ్వరరావు తెలిపారు. ఐదు దశాబ్దాలుగా ఆమె పాడిన పాటలు, ఆడిన ఆటలను ప్రజాకళా జాతరలో పునఃస్మరించుకుంటూ ఆమెతో గొంతు కలపాలని, ప్రజా ఉద్యమాల సాంస్కృతిక ప్రస్థానంతో మమేకం కావాలని పిలుపునిచ్చారు.తెలుగు సమాజంతో పాటు దేశవ్యాప్తంగా ప్రజలను ప్రభావితం చేసిన జానపద కళలు, వివిధ కళారూపాలను ప్రజాకళా జాతరలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో 50 గంటలపాటు జరిగే కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో జాను, రవణ, సమూయేలు తదితరులు పాల్గొన్నారు

# వాడపల్లి వెంకన్న సన్నిధిలో భక్తుల క్యూలైన్ కష్టాలు





- వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. టికెట్ల విధానంపై గందరగోళం
- రూ.200 టికెట్ తీసుకున్న వృద్ధురాలిని క్యూలో నుంచి వెనక్కి పంపిన ఘటన
- ఆలయ యంత్రాంగం తీరుపై భక్తుల అసంతృప్తి.. ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 19:**కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి శనివారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహిస్తూ 'గోవిందా.. గోవిందా' నామస్మరణతో భక్తిభావాన్ని చాటుకున్నారు.

వేకువజామున స్వామివారి మేలుకొలుపు సేవ, అలంకరణోత్సవం, ఐశ్వర్య లక్ష్మీ హోమం, సుప్రభాత సేవలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి తొలి హారతి సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది క్యూలైన్లను ఏర్పాటు చేసినప్పటికీ, టికెట్ల విధానంపై స్పష్టత లేకపోవడం కొంతమంది భక్తులకు ఇబ్బందిగా మారిందని ఆరోపణలు వినిపించాయి.

### రూ.200 టికెట్ తీసుకున్నా.. దర్శనానికి అడ్డంకి

ఇందులో భాగంగా నడవడానికి ఇబ్బందిపడుతున్న ఓ వృద్ధురాలు రూ.200 చెల్లించి ఆఫ్‌లైన్ టికెట్ తీసుకుని దర్శన క్యూలైన్‌లోకి ప్రవేశించారు. కొంతదూరం వెళ్లిన అనంతరం ఆ టికెట్‌తో ఆ క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతి లేదని, ఆన్‌లైన్ టికెట్ తీసుకోవాల్సిందేనని జూనియర్ అసిస్టెంట్ అధికారి ఆమెను వెనక్కి పంపినట్లు భక్తులు తెలిపారు.ఇప్పటికే నడవడానికి ఇబ్బందిపడుతున్న వృద్ధురాలు స్వామివారి దర్శనం కోసం ఎంతో ప్రయాసపడి ఆలయానికి వచ్చారని, చేతిలో రూ.200 టికెట్ ఉన్నప్పటికీ క్యూలైన్ నుంచి వెనక్కి పంపడం సరికాదని అక్కడున్న భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'టికెట్ తీసుకున్న తర్వాత కూడా దర్శనానికి ఎందుకు అనుమతించలేదు?' అంటూ ప్రశ్నించారు.

ఆన్‌లైన్ టికెట్ తీసుకోవాలంటే సెల్‌ఫోన్ అవసరం కాగా, ఆ వృద్ధురాలి వద్ద సెల్‌ఫోన్ అందుబాటులో లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కొంతసేపు అక్కడే కూర్చోబెట్టినట్లు భక్తులు పేర్కొన్నారు. సుమారు అరగంటకు పైగా ఆమె ఇబ్బందులు పడాల్సి వచ్చిందని తెలిపారు.



### భక్తులకు నిబంధనలు ముందే ఎందుకు చెప్పరు?

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టికెట్లకు వేర్వేరు క్యూలైన్లు ఉంటే ఆ విషయాన్ని టికెట్ జారీ చేసే సమయంలోనే భక్తులకు స్పష్టంగా తెలియజేయాలని పలువురు సూచిస్తున్నారు. ఒకసారి టికెట్ తీసుకుని క్యూలోకి పంపిన తర్వాత నిబంధనలు చెబుతూ వెనక్కి పంపడం వల్ల వృద్ధులు, మహిళలు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు.ప్రత్యేకించి వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న భక్తుల కోసం ప్రత్యేక సహాయక వ్యవస్థ ఉండాలని భక్తులు కోరుతున్నారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి వస్తున్న నేపథ్యంలో క్యూలైన్ల నిర్వహణలో మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.


### పెరుగుతున్న రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు ఏవీ?

వాడపల్లి ఆలయానికి భక్తుల రాక రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో దర్శన క్యూలైన్లు, టికెట్ కౌంటర్లు, ఆన్‌లైన్--ఆఫ్‌లైన్ దర్శన విధానాలపై మరింత సమన్వయం అవసరమని భక్తులు అభిప్రాయపడుతున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే శని, ఆదివారాలు, ప్రత్యేక పర్వదినాల్లో ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆలయ అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆ వాదనలకు భిన్నంగా ఉందని పలువురు భక్తులు వ్యాఖ్యానిస్తున్నారు. ఒక వృద్ధ భక్తురాలికి ఎదురైన ఇబ్బంది ఒక్క సంఘటనగానే కాకుండా, దర్శన నిర్వహణలో ఉన్న లోపాలను గుర్తించేందుకు అధికారులకు ఒక హెచ్చరికగా భావించాలని కోరుతున్నారు.

### ఉన్నతాధికారుల జోక్యం తప్పనిసరి

భక్తుల విశ్వాసానికి కేంద్రంగా ఉన్న ఆలయంలో సిబ్బంది వ్యవహారశైలి భక్తులకు ఇబ్బంది కలిగించేలా ఉండకూడదని భక్తులు స్పష్టం చేస్తున్నారు. క్యూలైన్లు, టికెట్ల విధానం, వృద్ధులు మరియు ప్రత్యేక అవసరాలు ఉన్న భక్తుల దర్శన ఏర్పాట్లపై ఆలయ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించాలని కోరుతున్నారు.టికెట్ నిబంధనలను కౌంటర్ల వద్ద స్పష్టంగా ప్రదర్శించడం, ఆఫ్‌లైన్ టికెట్ తీసుకున్న భక్తులకు ఏ క్యూలైన్ వర్తిస్తుందో ముందుగానే తెలియజేయడం, వృద్ధులకు ప్రత్యేక సహాయం అందించడం వంటి చర్యలు చేపట్టాలని భక్తులు సూచిస్తున్నారు.భక్తి విశ్వాసంతో స్వామివారి దర్శనానికి వచ్చే వారికి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ఆలయ యంత్రాంగంపై ఉందని, నిబంధనల అమలులో మానవతా దృక్పథాన్ని విస్మరించరాదని భక్తులు కోరుతున్నారు. శనివారం చోటుచేసుకున్న ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# విశ్వ బాంధుత్వంతోనే ప్రపంచ శాంతి సాధ్యం



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 19:** విశ్వ బాంధుత్వ భావనతోనే ప్రపంచంలో శాంతి, సామరస్యం సాధ్యమవుతుందని చత్తీస్‌గఢ్ సోషల్ రిఫార్మ్ స్టేట్ ఇన్‌చార్జ్ భోగి విశ్వనాథం అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నరేంద్ర గిరి పీఠం సహకారంతో విశ్వ బాంధుత్వ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భోగి విశ్వనాథం మాట్లాడుతూ స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11న చికాగోలో చేసిన చారిత్రాత్మక ప్రసంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని విశ్వ బాంధుత్వ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోని ప్రజలందరూ పరస్పర గౌరవం, సోదరభావం, మానవతా విలువలతో జీవించినప్పుడే సమాజంలో శాంతి, సామరస్యం నెలకొంటాయని అన్నారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మానవత్వాన్ని ప్రధానంగా భావించాలని పిలుపునిచ్చారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. అఖండ భారత నిర్మాణం సాధించేందుకు అవసరమైన అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమానికి ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విశ్వ బాంధుత్వ భావనను పెంపొందించడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం, సేవా దృక్పథం మరింత బలపడతాయని అన్నారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి సమాజ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అడ్వకేట్ శివ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు, డి. అశ్విని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## వైఎస్సార్ పార్టీ లోకి పలువురు చేరికలు



**సామర్లకోట రూరల్.. పెన్ పవర్... సెప్టెంబర్..19..**సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. జనసేన పార్టీకి చెందిన పలువురు నియోజకవర్గ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వేట్లపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిడదవోలు సురేష్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి దొరబాబు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రజా సమస్యలపై పార్టీ చేస్తున్న పోరాటానికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిడదవోలు సురేష్ చౌదరి, రాంబాబు, వేగుళ్ల వెంకటరమణ, మాకిరెడ్డి రాంబాబు, చిట్టూరి శ్రీను, థామస్ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతీ నెల 3వ శనివారం అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని ఈ శనివారం జగ్గంపేట స్వర్ణ జగ్గంపేట-1 కార్యాలయం (సచివాలయం) వద్ద నిర్వహించారు. జగ్గంపేట పంచాయతీ అభివృద్ధి అధికారి జి.శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జగ్గంపేట డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రీన్ ఆంధ్రా-కూల్ ఆంధ్రా థీమ్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిసరాల్లోని చెత్తను తొలగించారు. స్థానికులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచించారు. మన పరిసరాలు శుభ్రపరచుకోవడం ద్వారా కలిగే లాభాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ రమేష్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నిమజ్జనాలకు పుష్కర కాలువ వద్ద ఏర్పాట్లు



**జగ్గంపేట పంచాయతీ అభివృద్ధి అధికారి శివ**

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** గణపతి నిమజ్జనాలు సందర్భంగా జగ్గంపేట నుంచి గుర్రపాలెం వెళ్లే రహదారిలో పుష్కర కాలువ వద్ద ఏర్పాట్లు చేశామని జగ్గంపేట పంచాయతీ అభివృద్ధి అధికారి జి.శివ తెలిపారు. పుష్కర కాలువ వద్ద వంతెనపై కర్రలతో బారికేడ్లు ఏర్పాటు చేసి విద్యుత్ లైట్లు అమర్చామన్నారు. వంతెన పైనుంచే విగ్రహాలను నిమజ్జనాలు చేయడానికి తగిన ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు ఎవరూ కాలువలోకి దిగకుండా హెచ్చరిక బోర్డులు ఉంచామన్నారు. ఈ విషయాన్ని భక్తులంతా గమనించి నిమజ్జనాల సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని శివ తెలిపారు. నిమజ్జనాలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు.

## తెలుగు సాహితీ వనంలో చెరగని చరిత్ర ఆలమూరు గ్రామానిది

ఉషశ్రీ, పోలాప్రగడ, పోతుకూచి వంటి మహోన్నత రచయితలకు పుట్టినిల్లు.

గొడవర్తి శ్రీనివాసు రచించిన కడిమి పూలు కవితాసంపుటి ఆవిష్కరణలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 19:**తెలుగు సాహిత్యంలో ఆలమూరు గ్రామం కీర్తి అజరామరమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. శనివారం ఆలమూరు గ్రామ దేవత రావులమ్మ ఆలయం వద్ద గ్రామానికి చెందిన కవి గొడవర్తి శ్రీనివాస్ రచించిన కడిమిపూలు కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొని కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదుల లక్ష్మణ శర్మ ఎమ్మెల్యే బండారు సత్యానందరావును వేదాశీర్వచనం చేసి శేష వస్త్రంతో సత్కరించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన కడిమి పూలు కవితా సంపుటి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్రానికి పూర్వం నుంచి ఆలమూరు గ్రామం ఎందరో కవులకు,మహా మహా రచయితలకు పేరు పొందిందని, ఆ సాహిత్య వాతావరణాన్ని నేటి కవులు సైతం కొనసాగిస్తూ ఉండడం గర్వకారణమన్నారు. కడిమి పూలు అంటే కదంబ పుష్పాలని దేవతలు కదంబ వనాల్లో నడయాడుతారని మన పురాణాలు తెలియజేస్తున్నాయని, ఆ పేరుతో కవితా సంపుటి తీసుకురావడం హర్షనీయమన్నారు. కడిమి పూలు కవితా సంపుటి లోని ప్రజా రాజధాని అమరావతి, కాటన్ దొర, మా తల్లి గోదావరి మొదలైన కవితలను ఊటంకిస్తూ గొడవర్తి శ్రీనివాస్ మంచి కవిత్వం అందించారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సాహితీ కార్యక్రమాలు ఆలమూరులో నిర్వహించాలని శ్రీనివాస్ మరిన్ని మంచి రచనలు చేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాస్ కు ఎమ్మెల్యే సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజు, రచయితలు కృష్ణ శ్రీ, డా. ర్యాలి శ్రీనివాస్, డా. చల్లా రవికుమార్, గౌరీ మల్లిక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సన్మానాలతో ముగిసిన కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం.

-ఐదేళ్ల పదవీకాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసిన ఎంపీపీ తోట రవి.



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్,19:**ఈ నెల 24 తో ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండడంతో శనివారం కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఓ బాయిశెట్టి హరికృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిదులుగా ఎన్నికై ప్రజలకు ఏదో చేయాలనుకున్నాం, కానీ ఆశించన మేర ఏమీ చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల కాలంలో తమకు సహకరించిన ఎంపిపి తోట రవి అధికారులకు పలువురు ఎంపీటీసీలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీపీ తోట రవి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. ఐదు సంవత్సరాలుగా తమకు సహకరించిన ఎంపిటిసి సభ్యులకు, అధికారులకు ఎంపీపీ తోట రవి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈనెల 24 తో ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండడంతో ఎంపీడీఓ బాయిశెట్టి హరికృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని పలువురు అధికారులు ఎంపీపీ తోట రవితోపాటు ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హరికృష్ణ మాట్లాడుతూ ఐదేళ్ల పదవీ కాలంలో అధికారులకు అన్ని విధాలా సహకరించిన ఎంపీపీ, తోట రవి, వైస్ ఎంపిపిలు బొద్దేటి గణపతి, పాఠంశెట్టి సత్యవతి, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శిరామకృష్ణ,మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు బండారు ప్రసాద్,గరగా గోవిందు, బొద్దేటి నాగలక్ష్మి,సాదే కుమారి, గోకేడ రాజా, గుత్తుర్తి రమణ,కో ఆప్షన్ సభ్యులు వై మీకా,మండలం వ్యవసాయశాఖ అధికారి నాగం సుధామాధురి, ఏపీఎం, శరకణం వేదకుమారి, ఎంఈఓ, టి జోసెఫ్, వైద్యాధికారులు, రాంబాబు నాయక్,అభిషేక్, స్వాతి, సిడిపిఓ,ఎం పూర్ణిమ, మండల పరిషత్ పరిపాలనాధికారి ఎన్. ఎం.కె. జి. ప్రసాద్,మండలంలోని పలువురు అధికారులు, పలువురు నాయకులు పాల్గొని మండల ప్రజా పరిషత్ కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గోడే బాల,గొల్లపల్లి సూరిబాబు,పట్టు చంటిబాబు, బొజ్జపు శ్రీను, నంది బాలకృష్ణ, మంచికంటి శ్రీను,సాదే ఏసుబాబు, దూలపల్లి రమణ,తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వద్దు బ్రో.. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈగల్ టీం అవగాహన సదస్సు




**కాజులూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 19:** మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఈగల్ టీం కాకినాడ అధికారులు సూచించారు. కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ టీం కాకినాడ అధికారులు కే. ఆంజనేయులు, కే. తేజ, సీహెచ్. సుబ్రహ్మణ్యం విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావాలు, భవిష్యత్తులో ఎదురయ్యే నష్టాలను వివరించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాల అలవాట్లకు బానిసై విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఈగల్ టీం అధికారి కే. ఆంజనేయులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. యువత మంచి మార్గంలో పయనిస్తూ తల్లిదండ్రులకు, సమాజానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం కాకినాడ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో పంట సాగు జరగలేదు

జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు





**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** జగ్గంపేట వ్యవసాయ సహకార మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో శనివారం రైతుల కోసం ప్రత్యేకంగా ఒక అవగాహన సదస్సును నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు తగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఏడీ తారక రామారావు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది జిల్లాలో కేవలం 40 శాతం మాత్రమే వర్షపాతం నమోదైందని తెలిపారు. దీనివల్ల ఆశించిన స్థాయిలో పంటల సాగు జరగలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా 94,525 హెక్టార్లకు గాను కేవలం 83,144 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు చేశారని, సుమారు 12వేల ఎకరాల్లో సాగు నిలిచిపోయిందని ఆయన స్పష్టం చేశారు. అయితే, నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ పంటలు లేదా తక్కువ నీటితో పండే పైరు సాగు చేసుకుంటే రైతులకు కొంతైనా ఆదాయం సమకూరుతుందని ఆయన సూచించారు. రాబోయే రోజుల్లో మిగిలిపోయిన ఆ 12వేల ఎకరాల్లో సుమారు 3వేల ఎకరాల వరకు మళ్లీ పంటలు వేసేందుకు తగిన అవకాశం ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించారు. ముందుగా గ్రామంలోని వరి పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఏడీఏ గరిమెళ్ళ శ్రీనివాస్, జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి ఎస్ నరసింహం, సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.ద

## జెడ్పీ కార్యాలయంలో 'స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం



**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 19:** 'స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం నిర్వహించిన 'పచ్చని ఆంధ్ర--చల్లని ఆంధ్ర' కార్యక్రమం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పరిశుభ్రతపై సిబ్బందికి అవగాహన కల్పించి, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్, ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రతను కేవలం ప్రత్యేక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ప్రతిరోజూ కార్యాలయ పరిసరాలు, తమ తమ విభాగాల్లో శుభ్రతకు కొంత సమయం కేటాయించాలని సిబ్బందికి సూచించారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా శ్రమదానం చేయాలని, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సిబ్బంది చేపట్టే ప్రతి చిన్న ముందడుగు రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో దోహద పడుతుందని తెలిపారు. తమతోటి సిబ్బందికి కూడా పరిశుభ్రతపై అవగాహన కల్పించి,స్వచ్ఛత కార్యక్రమాలను నిరంతరం కొనసాగించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ పరిపాలనా అధికారులు,వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆసియా గేమ్స్‌లో నఖ్వీ చేతుల మీదుగా మెడల్స్: బీసీసీఐ ఏమందంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 ప్రారంభానికి ముందే భారత్, పాకిస్థాన్ క్రికెట్ బోర్డుల మధ్య మళ్లీ తీవ్ర ఉద్రిక్తత స్టార్ట్ అయింది. ఆసియా కప్‌లో పీసీబీ ఛైర్మన్, ఏసీసీ అధ్యక్షుడైన మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకునేందుకు టీమిండియా నిరాకరించిన సంగతి తెలిసిందే. కానీ జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు విజేతలుగా నిలిస్తే, అతడి చేతుల మీదుగానే గోల్డ్ మెడల్స్ తీసుకోవాల్సి రావచ్చుననే వార్త ఇప్పుడు క్రీడా ప్రపంచంలో తీవ్ర సంచలనం రేపుతోంది.

**నో చెబితే యాక్షన్: ఓసీఏ రూల్స్‌తో ఇరకాటంలో భారత్**

ఈ అంశంపై ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ాజూా) నిబంధనలు బీసీసీఐని ఇరకాటంలో పెట్టేలా ఉన్నాయి. ఆర్టికల్ 66 ప్రకారం విక్టరీ సెరెమనీలో మెడల్స్ ప్రెసెంట్ చేసే అధికారం ఓసీఎ అధ్యక్షుడికి ఉంటుంది. ఒకవేళ ఆయన పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి, పీసీబీ చీఫ్ అయిన మొహ్సిన్ నఖ్వీకి ఆ బాధ్యత అప్పగిస్తే, భారత అథ్లెట్లు కచ్చితంగా అతడి చేతుల మీదుగానే మెడల్స్ స్వీకరించాల్సి ఉంటుంది. ాజూా నిబంధనల ప్రకారం రాజకీయ లేదా ఇతర కారణాలతో విజేతల వేదికపై మెడల్స్ తీసుకోవడానికి నిరాకరిస్తే దాన్ని ఆసియా గేమ్స్‌ను అవమానించినట్లుగా పరిగణించి, భారత జట్టుపై క్రమశిక్షణా చర్యలు (ఞఅంఎఅజూశ్రీఅఖుతీఎ ాఞ్‌ఙఅశీఅ) తీసుకునే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది.

**ఆసియా కప్‌లో బీసీసీఐ బిగ్ షాక్:**

ఇటీవలే ముగిసిన మహిళల ఆసియా కప్‌లో విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు.. ఏసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న మొహ్సిన్ నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకోవడానికి నిరాకరించింది. అంతకుముందు పురుషుల ఆసియా కప్‌లోనూ భారత జట్టు నఖ్వీ నుంచి మెడల్స్ అందుకోవడానికి సున్నితంగా నో చెప్పేసింది. పాకిస్థాన్ ప్రభుత్వంతో ఉన్న ద్వైపాక్షిక ఉద్రిక్తతలతో బీసీసీఐ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కానీ ఇప్పుడు ఆసియా గేమ్స్ పొడియంపై మళ్లీ అదే వివాదం రిపీట్ అవుతుందా అనే ఉత్కంఠ నెలకొంది.

**ముందు గెలవనివ్వండి.. అప్పుడు చూద్దాం: బీసీసీఐ**

ఈ వివాదంపై బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ప్రస్తుతం మా దృష్టంతా మ్యాచ్‌లు గెలవడంపైనే ఉంది. ముందుగా మా జట్లు ఫైనల్ చేరి పొడియం వరకు వెళ్లాలి.. ఆ క్షణంలో ఉన్న పరిస్థితులు, ప్రొటోకాల్స్‌ను బట్టి మేము తగిన నిర్ణయం తీసుకుంటాం.. ఇంకా జరగని విషయాల గురించి ముందే వ్యాఖ్యానించడం సరికాదు.. ప్లేయర్లు, బోర్డు కేవలం పసిడి పతకాలు సాధించడంపైనే ఫోకస్ పెట్టారని స్పష్టం చేశారు. డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్న భారత పురుషుల, మహిళల జట్లు గోల్డ్ మెడల్స్ సాధించడం ఖాయంగా కనిపిస్తుండటంతో, విక్టరీ ప్రెజెంటేషన్ సమయానికి ఈ స్పోర్ట్స్ డ్రామా ఏ మలుపు తిరుగుతుందోనని ఉత్కంఠ నెలకొంది.

# వన్డేల్లో పంత్ ఆడటం ఇక కష్టమే.. భారత జట్టు సెలెక్షన్‌పై మాజీ క్రికెటర్ వ్యాఖ్యలు వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ వైట్ బాల్ కెరీర్‌పై సెలెక్టర్లు ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చేశారని మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా బాంబు పేల్చాడు. రాబోయే వెస్టిండీస్ వన్డే సిరీస్ నుంచి పంత్‌ను తప్పించడం, అదే సమయంలో ఇరానీ కప్ కోసం రెస్ట్ ఆఫ్ ఇండియా (=ా×) కెప్టెన్‌గా ప్రకటించడం వెనుక ఉన్న అసలు నిజాలను జియోస్టార్ (జీఅశ్ఖుతీ) వేదికగా విశ్లేషించాడు.

**ఆడకుండానే గుడ్ బై చెప్పేశారు:**

రిషభ్ పంత్ కేసు చాలా విచిత్రమైనది.. టెస్ట్ క్రికెట్‌లో అతడు టీమిండియాకు అత్యంత కీలకమైన ఆటగాడు (వైస్ కెప్టెన్సీ పోయినప్పటికీ).. కానీ వన్డే క్రికెట్ విషయానికి వస్తే మాత్రం.. అసలు మ్యాచ్‌లు ఆడకుండానే సెలెక్టర్లు అతడికి గుడ్ బై చెప్పేశారని ఆకాశ్ చోప్రా పేర్కొన్నాడు. రెడ్ బాల్ క్రికెట్‌లో పంత్ సేవలను వాడుకోవాలని భావిస్తున్న సెలెక్షన్ కమిటీ, వైట్ బాల్ క్రికెట్‌లో మాత్రం అతడికి డోర్స్ క్లోజ్ చేసినట్లే కనిపిస్తోందన్నాడు. గడిచిన నాలుగేళ్లలో పంత్ ఆడింది కేవలం ఒకే ఒక్క వన్డే కాగా, 2024 టీ20 వరల్డ్ కప్ విజయం తర్వాత పొట్టి ఫార్మాట్ జట్టులోనూ అతడు స్థానం కోల్పోయాడు.

**వరల్డ్ కప్ 2027 ప్లాన్స్.. గిల్ కెప్టెన్:**

2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ ప్రణాళికలు వేస్తోందని ఆకాష్ చోప్రా తెలిపాడు. విండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు జట్టులో కొనసాగుతున్నారు. శ్రేయస్ అయ్యర్ ఆసియా గేమ్స్ లో టీ20 జట్టుకి కెప్టెన్ గా ఉండటంతో కేఎల్ రాహుల్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఇక పంత్ లేకపోవడంతో ధ్రువ్ జురెల్ కీపింగ్ ఆప్షన్‌గా రేసులోకి వచ్చాడు.

**జైస్వాల్ ఊం గైక్వాడ్.. ఆకిబ్ నబీపై నజర్:**

భారత జట్టులో రిజర్వ్ ప్లేయర్ల కోసం తీవ్ర పోటీ నెలకొందని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా పేర్కొన్నాడు.

రేసులో ఓపెనర్లు: యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్‌ల మధ్య విండీస్ సిరీస్‌లో తీవ్ర పోటీ ఉంటుందని, వీరికి వచ్చిన అవకాశాలను మిస్ చేసుకోకూడదని చూస్తున్నారు.

ఆకిబ్ నబీ ఎంట్రీ: సుదీర్ఘకాలంగా బెంచ్‌కే పరిమితమైన పేస్ బౌలర్ ఆకిబ్ నబీకి ప్లేయింగ్ ఎలెవన్ లో అవకాశం వస్తే చూడాలని ఉంది.

భారత్, వెస్టిండీస్ మధ్య 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ సెప్టెంబర్ 27న తిరువనంతపురంలో ప్రారంభం కానుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 30న గౌహతిలో రెండో వన్డే, అక్టోబర్ 3న న్యూ చండీగఢ్‌లో ఆఖరి వన్డే జరగనున్నాయి.

# రోహిత్‌తో రచ్చ.. లక్ష్మణ్‌తో వార్: అజిత్ అగార్కర్‌పై బీసీసీఐ వేటు!



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌కు ముందు భారత క్రికెట్‌లో సంచలనాలు చోటు చేసుకుంటున్నాయి. టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌ను బాధ్యతల నుంచి తప్పించేందుకు బీసీసీఐ సిద్ధమైంది. మూడేళ్లలో నాలుగు ఐసీసీ ఫైనల్స్ చేరి, మూడు ట్రోఫీలు అందించిన ఘనమైన రికార్డు అగార్కర్ ప్యానెల్‌కు ఉన్నప్పటికీ, బోర్డులోని పెద్దలతో తీవ్ర విభేదాలు రావడంతోనే అతడిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తుంది.

**రోహిత్ తొలగింపుకు ప్లాన్.. అగార్కర్‌కు రివర్స్ షాక్:**

ఇంగ్లాండ్ తో సిరీస్ ముగిసిన వెంటనే రోహిత్ శర్మను వన్డేల నుంచి తప్పించాలని అజిత్ అగార్కర్ చూశాడు. 2027 వరల్డ్ కప్ లక్ష్యంగా యశస్వి జైస్వాల్‌ను వన్డేల్లో ఓపెనర్‌గా సిద్ధం చేయాలని, అందుకే రోహిత్‌కు రెస్ట్ ఇవ్వాలని భావించాడు.

ప్రజ్ఞాన్ ఓజాతో కబురు: రోహిత్ శర్మకు అత్యంత ఆప్తుడైన సౌత్ జోన్ సెలెక్టర్ ప్రజ్ఞాన్ ఓజాతో ఈ విషయాన్ని రోహిత్‌కు చెప్పించారు.

పెద్దలకు కంప్లైంట్: 2027 వన్డే వరల్డ్ కప్ ఆడాలని పట్టుదలతో ఉన్న రోహిత్ శర్మ, బీసీసీఐలోని ఒక పవర్‌ఫుల్ అడ్మినిస్ట్రేటర్‌ను కలిసి సెలెక్టర్ల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు.

అగార్కర్‌కు చెప్పకుండానే ప్రకటన: అగార్కర్‌కు కనీసం సమాచారం ఇవ్వకుండానే బీసీసీఐ.. రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలను ఖండిస్తూ అధికారిక ప్రకటన రిలీజ్ చేసింది. ఇది తనను తీవ్రంగా అవమానించడమేనని అజిత్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

**వీవీఎస్ లక్ష్మణ్‌తో అగార్కర్ డైరెక్ట్ వార్:**

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌తో అజి అగార్కర్‌కు కూడా పొసగడం లేదని వార్తలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి.

ఆసియా గేమ్స్ వివాదం: ఆసియా గేమ్స్‌కు మెయిన్ టీమ్‌ను పంపాలా వద్దా అనే విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. లక్ష్మణ్ అత్యుత్తమ జట్టును పంపాలని కోరగా, ఆసియా గేమ్స్‌కు ద్వితీయ శ్రేణి జట్టు సరిపోతుందని అగార్కర్ పేర్కొన్నాడు.

ఇండియా ఏ షెడ్యూలింగ్ పై రచ్చ: శ్రీనగర్‌లో జరిగే ఇరానీ కప్, పుదుచ్చేరిలో జరిగే ఇండియా-ఎ మ్యాచ్‌ల తేదీలు ఒకేసారి రావడంపై వీవీఎస్ లక్ష్మణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆటగాళ్ల గాయాల జాబితా మీడియాకు లీక్ కావడం కూడా ఇద్దరి మధ్య గొడవ మరింత పెరిగేలా చేసింది.

**రివ్యూ మీటింగ్‌కు డుమ్మా.. కథ ముగిసింది:**

ఇంగ్లాండ్ పర్యటన డిజాస్టర్ కావడంపై చర్చించేందుకు ముంబైలో జరిగిన అత్యంత కీలకమైన బీసీసీఐ రివ్యూ మీటింగ్‌కు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకాకపోవడం తీవ్ర వివాదానికి దారి తీసింది. దీంతో బోర్డు పెద్దలు అగార్కర్‌ను తప్పించి, కొత్త చీఫ్ సెలెక్టర్‌ను నియమించాలని ఫిక్స్ అయ్యారు. దిగ్గజ ప్లేయర్ల రిటైర్మెంట్ లేదా కొనసాగింపు బీసీసీఐ బోర్డు చేతుల్లోనే ఉంటుందని, సెలెక్టర్లకు ఆ అధికారం లేదనే విషయాన్ని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

# బయోపిక్స్ లో అనుష్క శెట్టికి అవకాశమే లేదా?







దక్షిణాది చిత్రసీమలో లేడీ సూపర్ స్టార్ గా తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న నటి అనుష్క శెట్టి. నాయికా ప్రాధాన్యమున్న చిత్రాలకు చిరునామాగా బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాసిన ఘనత స్వీటీది. -అరుంధతి-, -బాహుబలి-, -భాగమతి లాంటి సినిమాలతో గంభీరమైన నటనను ప్రపంచానికి చాటిచెప్పిన అనుష్క కెరీర్‌లో పెద్ద లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ట్రెండ్‌గా మారిన బయోపిక్ చిత్రాల్లో ఇప్పటివరకు అనుష్కకు అవకాశం రాకపోవడం..కనీసం ఆమె పేరు పరిశీలనలోకి కూడా లేకపోవడం విచారకరం.

కొన్నేళ్లుగా భారతీయ చిత్ర పరిశ్రమలో బయోపిక్స్ హవా నడుస్తోంది. క్రీడాకారులు, రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు , చారిత్రక నటీమణుల నిజ జీవిత కథలను వెండితెరపై ఆవిష్కరించేందుకు దర్శక, నిర్మాతలు పోటీ పడుతున్నారు. తోటి కథానాయికలు నిజ జీవిత పాత్రల్లో ఒదిగిపోతూ జాతీయ అవార్డులు, ప్రశంసలు అందుకుంటుంటే? అనుష్క లాంటి సీనియర్ పేరు ఏ బయోపిక్ రేసులో ఎక్కడా వినిపించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.గతంలో అనుష్క రుద్రమదేవి చిత్రంలో కాకతీయ వీరనారిగా నటించినా? అది చారిత్రక నేపథ్యం ఉన్న సినిమాటిక్ యాక్షన్ డ్రామాగా మాత్రమే నిలిచింది తప్ప స్వచ్ఛమైన బయోపిక్‌గా గుర్తింపు పొందలేదు. నిజమైన వ్యక్తిత్వాలు, కాలానికి తగిన మానవీయ కోణాలు, మానసిక సంఘర్షణలతో కూడిన బయోపిక్ పాత్రలు స్వీటీ ఖాతాలో పడలేదు.

ఇండస్ట్రీలో ప్రాజెక్టుల ఎంపిక విషయంలో అనుష్కను లార్జర్ దాన్ లైఫ్, ఫాంటసీ, రాయల్ పాత్రలకే పరిమితం చేస్తున్నారా? అనే అనుమానం కలుగుతోంది. ఈ పరిస్థితికి అనేక కారణాలు ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అనుష్క ఇటీవలి కాలంలో సినిమాల ఎంపికలో వేగం తగ్గించి సెలెక్టివ్‌గా వ్యవహరిస్తుండ. మరోవైపు దర్శకులు కూడా ఆమె స్టార్‌డమ్‌కు తగ్గ బయోపిక్ స్క్రిప్ట్‌లను రూపొందించడంలో విఫలమవుతున్నారు. అనుష్క గంభీరమైన రూపంతో పాటు -విక్ర మార్కుడు-, -వేదం- లాంటి చిత్రాల్లో చూపించిన వైవిధ్యమైన నటనను మర్చిపోయి కాస్ట్యూమ్ డ్రామాలకే ఆలోచించడం దర్శకుల దృష్టి లోపంగానే భావించాలి.నటిగా అనుష్క సామర్థ్యం ఎలాంటిదో? ప్రత్యేకంగా చెప్పాల్సిన లేదు. -సైజ్ జీరో- కోసం శరీరాన్ని మార్చుకున్న తీరు, -వేదం-లో సరోజగా చూపించిన భావోద్వేగాలు ఆమెలోని నటనా పటిమకు నిదర్శనాలు. నిజ జీవిత పాత్రను భుజాలపై మోసి దానికి ప్రాణప్రతిష్ఠ చేయగల అన్ని అర్హతలు, ఆత్మవిశ్వాసం ఆమెకు పుష్కలంగా ఉన్నాయి. అయినా? గొప్ప బయోపిక్‌లో నటించే అవకాశం అనుష్క తలుపు తట్టకపోవడం టాలీవుడ్‌లోనే కాక సౌత్ ఇండియాలోనే ఒక లోటుగా చెప్పొచ్చు.అనుష్క శెట్టి లాంటి దిగ్గజ నటి కెరీర్ పరిపూర్ణం కావాలంటే ఆమె ఖాతాలో క్లాసిక్ బయోపిక్ చేరడం అవసరం. ఇప్పటికైనా దర్శక, రచయితలు మూస ధోరణి పాత్రలకే పరిమితం కాకుండా అనుష్క నటనా పరిణతికి సరిపోయే బయోపిక్ కథతో ముందుకు రావలసి ఉంది. లేడీ సూపర్‌స్టార్‌గా చరిత్ర సృష్టించిన అనుష్క శెట్టి గొప్ప నిజ జీవిత పాత్ర ద్వారా వెండితెరపై మళ్లీ విశ్వరూపం చూపించాలని అభిమానులు, సినీ ప్రేమికులు ఆశిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com